పేదల నెత్తిపై కూటమి బండ

- గ్యాస్ డెలివరీలో నిలువు దోపిడీ
- సిలిండర్ పై అదనంగా రూ.30 నుంచి రూ.50 వసూలు
- 15 కిలోమీటర్ల వరకు ఉచితడెలివరీ నిబంధన
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పౌర సరఫరాల అధికారులు


డెలివరీ ఇచ్చేందుకు తీసుకువెళుతున్న గ్యాస్ సిలిండర్లు

పాలకోడేరు: సామాన్యుడి వంటింట్లో ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ మంట పెట్టింది. కొన్ని రోజులగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టింది. పేద, సామాన్య కుటుంబాలకు గ్యాస్ ధర గుదిబండగా మారింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న సామాన్యుడిపై మరో భారం పడింది. కేంద్ర ప్రభుత్వం పేద, సామాన్య కుటుంబాల్లో గ్యాస్ మంటలు రేపింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ.840 ఉండగా తాజాగా కేంద్రం మరో రూ.50 పెంచింది. దీంతో పేదవర్గాల్లో ఆందోళన వ్యక్తమువుతుంది. ఉజ్వల పథకం లబ్ధిదారులను సైతం ప్రభుత్వం కనికరించలేదు. వారికి కూడా ఈ పెంపు వర్తింపు జేయడం గమనార్హం. ఇకపై ప్రతి 15రోజులకు లేదా నెలకోసారి ధరలపై సమీక్షిస్తామని ప్రకటించడంతో భవిష్యత్తులో గ్యాస్ ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నయనే సంకేతాలు ఇచ్చినట్లయింది. అయితే గ్యాస్ సిలిండర్ డెలివరీ కోసం 15 కిలోమీటర్లు వరకు ఎలాంటి రుసుం వసూలు చేయరాదనే నిబంధనలు అమలు కావడం లేదు. ఉండి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 10కిలోమీటర్ల లోపే ఉన్న గ్రామాల్లో సిలిండర్ డెలివరీ అవుతున్న కనీసం రూ.30 నుంచి 50 వసూలు చేస్తున్నారు. ఆపై దూరాన్ని బట్టి మరింత అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

దోచుకుంటున్నారు

ఉండి నియోజకవర్గంలోని 72 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలు మండల కేంద్రానికి 15కిలోమీటర్ల లోపే ఉన్నాయి. వీరందరికి ఇండియన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్ ప్రతివారం రోజులకు ఓ సారి గ్యాస్ సరఫరా వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. అయితే డోర్ డెలివరీ పేరుతో వినియోగదారులను దోచుకుంటున్నారు. ఉండి నియోజకవర్గంలో ఆకివీడు మండలం 22,399, ఉండి మండలం 21,183, కాళ్ల మండలం 22,300 పాలకోడేరు మండలం 21,857లో గ్యాస్ కనెక్షన్ లు ఉన్నాయి. వీరందరూ ఇండియన్, హెచ్‌పీ, భారత్‌గ్యాస్ గ్యాస్ సిలిండర్లనే వినియోగిస్తున్నారు ఒక వినియోగదారుడు నుంచి రూ. 30 నుంచి 50 చొప్పున అదనంగా రూ.5 అదనంగా నెలకు రూ.5లక్షలనుంచి రూ. 7 లక్షలు వరకు వినియోగదారుల నుంచి దోచుకుంటున్నారు.

ఫిర్యాదు చేస్తేనే చర్యలు

గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీని పౌర సరఫరాల అధికారులు పరిశీలించడం లేదు. నెలవారీగా ఏజెన్సీ నిర్వాహకుల నుంచి వస్తున్న మామూళ్లు తీసుకొని మిన్నకుండి పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సిలిండర్ డెలివరీ విషయంలో చాలా మంది వినియోగదరులు డెలివరీ బాయ్స్‌తో గొడవ పడి ఇబ్బంది పడుతున్నారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే తప్ప అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో దోపిడీ యథాతథంగా కొనసాగుతోందని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

డోర్ డెలివరీ బాయ్స్ డిమాండ్ చేయడం లేదు

డోర్ డెలివరీ చేయడానికి బాయ్స్ ఎటువంటి రుసు వసూలు చేయకూడదు. వినియోగదారులు ఇస్తే తీసుకుంటున్నారు. డిమాండ్ చేయడం లేదు. అయినా మేము ప్రతి గ్రామానికి డోర్ డెలివరీ చేస్తున్నాం అయినా రూ.50 వసూలు చేస్తున్నారని మా దృష్టికి రాలేదు. – ఎస్ జి కృష్ణ, ఇండేన్ ఏజెన్సీ నిర్వాహకులు

నిబంధనలు పాటించాలి

15 కిలోమీటర్లు వరకు గ్యాస్ సిలిండర్ డెలివరీ కోసం ఎలాంటి రుసుం వసూలుచేయరాదు, అలా చేస్తే ఫిర్యాదు చేయండి తక్షణమే చర్యలు తీసుకుంటామని డీఎస్‌ఓ సరోజ తెలిపారు. ఏజెన్సీ వాళ్లు విధిగా నిబంధనలు పాటించాలని కోరారు. – డీఎస్‌ఓ సరోజ

క్లుప్తంగా

డీఎన్నార్‌లో ముగిసిన ఇంగ్లీష్, గ్రామర్ శిక్షణ తరగతులు


వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంగ్లీస్ స్టడీమెటీరియల్ పంపిణీ చేసిన దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎన్నార్ స్కూల్లో గత పది రోజులుగా నిర్వహించిన స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా డాక్టర్ ఎంఆర్ రాజు మాట్లాడుతూ ఇంగ్లీష్ భాష ప్రావీణ్యత విద్యార్థుల ప్రగతికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంగ్లీష్ స్టడీమెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు, డీఎన్నార్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి కె రామకృష్ణంరాజు, ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, పీఎస్ఎన్ రాజు, శ్యామ్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాములోరికి అభిషేకాలు


స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద కోదండ రాముడికి అభిషేకం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద కోదండ రాములోరికి శనివారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామి వారి పునర్వశ నక్షత్రం సందర్భంగా అభిషేకాలు చేయడం ద్వారా లోక సుభిక్షంగా ఉంటుందని ఆలయ నిర్వాహకులు అన్నం హరిదాస్ చెప్పారు. ఇటీవల రాములోరి ఆలయాన్ని నూతనంగా నిర్మించిన విషయం విధితమే.

నంద్యాలకు ఎన్టీఆర్ జాతీయ కీర్తి పురస్కారం


చల్లారావును సత్కరిస్తున్న దృశ్యం

ఆకివీడు : పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన ఆదర్శ రైతు నంద్యాల చల్లారావుకు ఎన్టీఆర్ జాతీయ కీర్తి పురస్కారం విజయవాడలో శనివారం అందజేశారు. ఈ విషయాన్ని ఒక ప్రకటనలో ఆయన వెల్లడించారు. ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని తనకు అందజేసి సత్కరించారని వివరించారు.

5 నుంచి ఉపాధ్యాయ సంఘాల ఉద్యమ కార్యాచరణ

తణుకు అర్బన్: విద్యా, ఉపాధ్యాయరంగ సమస్యల పరిష్కారంలో భాగంగా పాఠశాలల్లో విద్యాశాఖ చేపడుతున్న అసంబద్ధ విధానాలకు నిరసనగా ఈనెల 5వ తేదీ నుంచి ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పీఎస్‌వి ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ఎ. వీరభద్రరావు, కార్యదర్శి వి. రామమోహన్ తెలిపారు. పాఠశాలల వర్గీకరణ వంటి అసంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే 3 పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని, 12వ పిఆర్సీ ఏర్పాటు చేయాలని, ఆర్థిక బకాయిలను చెల్లించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం మూడంచెల కార్యాచరణలో భాగంగా మే 5న పాత తాలూకా కేంద్రాలలో 9న జిల్లా కేంద్రాలలో 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

కోతాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

అత్తిలి: మండలంలోని ఉనికిలిలో కోతాట ఆడుతున్న ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు చెప్పారు. శనివారం అత్తిలి మండలం ఉనికిలి గ్రామ శివారు కాలువగట్టుపై ముద్దాయిలు డబ్బులు పణంగా పెట్టి కోతబంతి ఆట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై ప్రేమరాజు సిబ్బందితో దాడిచేసి ఇద్దరు ముద్దాయిలను అదుపులోకి తీసుకుని వారివద్దనుండి రూ. 2500లు నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

భవన నిర్మాణాల అనుమతులకు వెసులుబాటు

తణుకు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో ఎంఎస్ నంబరు 20 మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రకారం పట్టణ పరిధిలోని ప్రజలు సులభతరంగా స్వీయ ధ్రువీకరణ పత్రం పత్రం సమర్పించి భవన నిర్మాణ అనుమతులు పొందుటకు వెలుసుబాటు కల్పించినట్లు తణుకు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. మునిసిపాలిటీ లైసెన్స్ పొందిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, సర్వేయర్స్, ఇంజనీర్ల ద్వారా గ్రామ కంఠము, అధికార లేఅవుట్స్, సర్కులేషన్ ప్యాటరన్స్ ప్రాంతాల్లో నివాసం కోసం భవన నిర్మాణ అనుమతులు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి సులభతరంగాను, అత్యంత పారదర్శకంగా పొందవచ్చని సూచించారు.

లేబర్ కోడ్స్ రద్దుకు వ్యతిరేకంగా 20న నిరసన


భీమవరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

భీమవరం: లేబర్‌కోడ్స్ రద్దుకు నిరసనగా ఈనెల 20వ తేదీన జిల్లాలోని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబురావు అన్నారు. శనివారం భీమవరం యూటీఎఫ్ కార్యాలయంలో రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతుల ఉమ్మడి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరే రామ్, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం కేంద్రం చట్టం తెస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించే గ్రామీణ హర్తాళ్లకు కార్మికులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


మొగల్లులో కిశోరి వికాసంపై మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి కె సుజాత

పాలకోడేరు: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అని పంచాయతీ కార్యదర్శి కె సుజాత తెలిపారు. పాలకోడేరు మండలం మోగల్లు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసిడిఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి అధ్యక్షతన కిశోరి వికాసం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి కె. సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఖ్యంగా మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అనారోగ్యాలు సంభవించకుండా ఉంటాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, పిల్లల పట్ల అత్యంత శ్రద్ధ వహించి వారికి మంచి పోషకాహారం అందజేసి వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పాటు అందజేయాలన్నారు. విద్య యొక్క ప్రాముఖ్యత, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ, యోగ జీవనోపాధి అవకాశాలు, తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి శ్రీనివాస్, అంగన్‌వాడీ విమల, చంద్రకుమారి , నాగలక్ష్మి, జ్యోత్స్న, రాధ, దేవి, మంగతాయారు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు


ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో డీఈవో నారాయణ, ఎమ్మెల్సీ గోపిమూర్తి

కాళ్ల: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడం ద్వారా చదువులో మొదటి మెట్టును దిగ్విజయంగా పూర్తి చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని శాసనమండలి సభ్యులు బొర్రా గోపిమూర్తి, డీఈఓ నారాయణ అన్నారు. యూటీఎఫ్ కాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో కోపల్లె హైస్కూల్లో ప్రతిభావంతులకు శనివారం పురస్కారాలు అందజేశారు. హక్కుల కోసం పోరాడడంతోపాటు పాఠశాల ఎన్రోల్మెంట్ పెంచడానికి కృషి చేయడం, అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను సత్కరించడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామన్నారు. కాళ్ల మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులతో పాటు 9 హైస్కూల్లోని 18 మందిని సత్కరించారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఏకేవీ రామభద్రం, కె.శ్రీదేవి, డివైఈవో శ్రీ ఎస్.రమేష్, ఎంఈఓలు ఎ.రవీంద్ర, వి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు



భీమవరంలో యుటీఎఫ్ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులు కార్యకర్తల అధ్యయన స్థాయిని పెంచడానికి, చైతన్యవంతులను చేయడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. భీమవరం అంబేద్కర్ కమ్యూనిటీహాల్లో శనివారం ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా యుటిఎఫ్ భావజాలం, విద్యారంగ పరిణామాలు, నిర్మాణ కర్తవ్యాలు టీచర్ అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిఎస్ విజయరామరాజు అధ్యక్షత వహించగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతికి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పీ మనోహర్ కుమార్, ఎస్ అరుణకుమారి, ఎస్ కుమార్ రాజా, సిహెచ్ పట్టాభి రామయ్య, కె రాజశేఖర్, పి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు

చలివేంద్రం ప్రారంభం



కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చలివేంద్రం ప్రారంభిస్తున్న ఈఓ అరుణ్ కుమార్

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో స్వయంభూః వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని భక్తులు కొనియాడారు. వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ చలివేంద్రంను ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు, భక్తుల దాహార్తిని తీర్చేందుకు స్వామి వారి ఆలయ ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం మంచి పరిణామన్నారు. అదేవిధంగా ఈనెల 6వతేది మంగళవారం నుంచి 14వ తేదీ వరకు స్వామివారి వార్షిక తిరుకళ్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి అరుణ్ కుమార్ తెలిపారు. 8వతేది రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందని, అదేవిధంగా 12వ తేదీ సోమవారం సాయంత్రం స్వామివారి దివ్యరథోత్సవం జరపనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


భీమవరంలో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందచేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: వ్యవసాయంలో ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులు సాధించడానికి అధునాతన సాంకేతిక పద్ధతులను అనుసరించాలని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం భీమవరం మార్కెట్‌యార్డ్‌లో నియోజకవర్గస్థాయిలో 55 వ్యవసాయ యంత్రపరికరాలను లబ్ధిదారులకు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సుమారు రూ. 27.70 లక్షల రాయితీతో భీమవరం మండలంలో 33, వీరవాసరం మండలంలో 22 వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం జెడ్పీటీసీ గుండా జయప్రకాష్‌నాయుడు, ఎంపీపీ వీరవల్ల దుర్గాభవాని, వ్యవసాయఏడీ ఎ శ్రీనివాస్, ఏవోలు నిమ్మల శ్రీనివాసరావు, బి థామస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహదేవపట్నంలో ఉచిత వైద్య శిబిరం

ఉండి: మండలంలోని మహదేవపట్నం గ్రామంలో భీమవరం వినాయక ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని హైస్కూల్ ప్రక్కన గల పంచాయతీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు ఈ వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, గర్భిణులకు, బాలింతలు, ఎముకల నిపుణులతో పాటు చిన్నపిల్లల వైద్య నిపుణులు ఈ వైద్య శిబిరంలో సేవలందిస్తారని తెలిపారు. కనుక ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లక్ష్మీ నరసింహస్వామికి విశేష పూజలు


లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ :పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణం చేయడం ఆనందదాయకమని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సంతోషం వ్యక్తం చేశారు. శనివారం లక్ష్మీనరసింహస్వామి నూతన ఆలయంలోని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 300 ఏళ్ల క్రితం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉన్నట్లు చరిత్రలో ఉందన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఆలయ పునఃనిర్మాణానికి తాను దేవదాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో రూ.1.40 కోట్లు మంజూరు చేయడం తనకు లభించిన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆలయ అభివృద్ధికి స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, తగరంపూడి మురళీ, గారపాటి వీర కుమార్, ఆరమిల్లి రవి, లంకా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులు వడ్డీ లేకుండా చెల్లించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ) : ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి జూన్ 30లోపు వడ్డీ లేకుండా చెల్లించాలని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఒకేసారి చెల్లించే వారికి మాత్రమే వడ్డీ లేకుండా వర్తిస్తుందని మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు వెల్లడించారు. పురపాలక సంఘ కార్యాలయం కౌంటర్లోగాని, సచివాలయం ఆన్‌లైన్ ద్వారా గాని చెల్లించాలని తెలిపారు. చెక్కులు, డీడీలు చెల్లించదలిచిన వారు పురపాలక సంఘ కార్యాలయంలో నేరుగా చెల్లించి రశీదు పొందవచ్చునని చెప్పారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి



భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

భీమవరం: ఉండి నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు ఆదేశాలతో నిర్ధాక్షిణ్యంగా పేదల ఇళ్లకూల్చివేయడాన్ని నిరసిస్తూ ఈనెల 6న గరగపర్రు రోడ్డులోని డిమార్టు ఎదురుగా సీపీఎం ఆధ్వర్యంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.బలరామ్ తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బహిరంగ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు వామపక్ష, ప్రజా, దళిత సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో పేదలను రోడ్లపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలతో ఇళ్ల తొలగించామని చెబుతున్నా కోర్టు స్టేటస్‌కో ఇచ్చినవాటిని కూడా తొలగించారని చెప్పారు. 6వతేదీని జరిగే బహిరంగ సభకు ప్రజలు, బాధితులు పెద్దఎత్తున తరలిరావాలని బలరామ్ పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జెఎంవి గోపాలన్, జిల్లా కార్యదర్శి బి వాసుదేవరావు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

భీమవరం: చట్టాల పరిరక్షణకు న్యాయస్థానాలు ఉన్నాయని భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి, పోక్సోకోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి. లక్ష్మీ నారాయణ అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శనివారం భీమవరం 3వ అదనపు జిల్లా కోర్టులో మునిసిపల్, లేబర్, మండలపరిషత్, ఆరోగ్య, విద్య, పోలీసు శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి సురేష్‌బాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురవుతున్నారని, బిల్డర్లకు ప్లాను మంజూరు చేసేటప్పుడే కార్మికులకు ప్రమాదాలు జరగకుండా నివారణా చర్యలు తీసుకునే విధంగా పర్యవేక్షించాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ లేబర్ లక్ష్మి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 4.5 లక్షల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారని అందులో సుమారు 2.5 లక్షల మంది వ్యవసాయ రంగానికి చెందినవారేనని వారందరినీ గ్రామ సచివాలయాల ద్వారా ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ కె రామచంద్రారెడ్డి, ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు ఎస్ సాయి కిరణ్మయి, డిప్యూటీ ఎంపీడీఓ జె ఈశ్వరరావు, మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు జవ్వాది సత్యనారాయణ, టీపీఓ సిహెచ్ పార్థసారధి, ఎంఈవో ఎన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యోగతో మానసిక ఉల్లాసం


భీమవరంలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగ శిక్షణలో జేసీ తదితరులు

భీమవరం: ఉద్యోగులు మానసిక ఒత్తిడిని అధిగమించి విధులను మరింత ఉత్సాహంగా నిర్వహించేందుకు యోగ ఎంతోగానో దోహదం చేస్తుందని జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భీమవరం కాస్మోపాలిటీ క్లబ్‌లో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు యోగ, ప్రాణాయం, మెడిటేషన్‌పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో ఉద్యోగులు ఎంతో ఒత్తిడికి గురవుతుంటారని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు యోగా చక్కటి మార్గమన్నారు. సద్గురు వాసుదేవ్‌చే స్థాపించిన లాభాపేక్షలేని ఆధ్యాత్మిక సంస్థ ఇషా ఫౌండేషన్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఏషాంగ్ రవి చంద్రారెడ్డి మాట్లాడుతూ యోగా వల్ల లభించే ప్రయోజనాలను వివరించారు. నేడు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అధిక ఒత్తిడికి వల్ల అనేక శారీరక, మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని అందువల్ల ప్రతి ఒక్కరు కొంత సమయాన్ని యోగ, మెడిటేషనకు కేటాయిస్తే శారీరిక, మానసిక ఆరోగ్యంతో, సంతోషంతో జీవితం కొనసాగించవచ్చునన్నారు. ఈనాటి శిక్షణా కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, డీఈవో ఇ నారాయణ, డీపీఓ బి అరుణశ్రీ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు మంగపతిరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ పి.జి. ఆర్.ఎస్ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఎక్కడ ఉన్నా నిస్వార్థ సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వరదలు, తుఫాన్లు వంటి విపత్కర సమయాలలో వారు అందజేసే సేవలు మరువరానివన్నారు. జిల్లాలో గత మూడు సంవత్సరాలుగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాలు, ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలు గురించి రెడ్‌క్రాస్ సిబ్బందిని అభినందించారు. జిల్లాలో రెడ్‌క్రాస్, జిల్లా అధికారులు అందజేస్తున్న సేవలకు గుర్తుగా వరుసగా మూడు సంవత్సరాలుగా జిల్లా గోల్డ్ మెడల్‌కు ఎంపిక కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. తల సేమియా, ఐ బ్యాంక్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు త్వరలో ఏర్పడే నూతన కమిటీ ఆధ్వర్యంలో జరగాలని డిఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు సూచించారు. నూతన కమిటీని త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. రెడ్‌క్రాస్ పశ్చిమగోదావరి జిల్లా శాఖ చైర్మన్ మంతెన శివరామభద్రిరాజు పాల్గొన్నారు.